## ఉద్యోగుల సిఫార్సులకు ప్రాధాన్యతివ్వండి

**-అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి ఉద్యోగసంఘాల వినతి**



తిరుమల,జూన్ 25(ప్రభాతవార్త)ప్రతినిధి: భక్తుల సేవలో ఇతోధికంగా పనిచేస్తున్న టిటిడి ఉద్యోగులకు తగిన విధంగా దర్శనాలు, వసతి సౌకర్యంలో సిఫార్సు లేఖలకు ప్రాధాన్యతనివ్వాలని టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరిని కోరారు. ఆయన నుండి సానుకూలస్పందన రావడంతో ఉద్యోగసంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి అధ్యక్షతన సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఈఓలు ఆలయం, రిసెప్షన్, విఎస్ఓ సమక్షంలో టిటిడి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై నాయకులు చీర్లకిరణ్, రేఖ, శివ, వంకీపురం పవన్, ఈశ్వర్‌నాయక్ ,ఉమ, గుణ తదితరులు పాల్గొని వినతిపత్రం అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గ్యాస్ సిలిండర్ పేలి ఫర్నీచర్ గోడౌన్ దగ్ధం

**- లక్షలాది రూపాయల నష్టం!**





రామకుప్పం, జూన్ 25 ప్రభాతవార్త
మండలంలోని బందార్లపల్లి పంచాయతీ బగళనత్తం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి ఓ ఫర్నీచర్ గోడౌన్ దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. బగళనత్తంకు చెందిన లక్ష్మమ్మ తమ షెడ్డును రామకుప్పంకు చెందిన అక్బర్ బాషాకు ఏడాదిన్నర క్రితం అద్దెకు ఇచ్చారు. అక్కడ అక్బర్ బాషా సోఫాలు, పరుపులు తయారీ చేసేవాడు. మంగళవారం రాత్రి హఠాత్తుగా షెడ్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో అక్కడున్న ఫర్నీచర్, ముడి సరుకులు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నాలు చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా ఈ ప్రమాదంలో దదాపు 42లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు సమాచారం.

# మామిడి రైతుకు న్యాయం

**- రాష్ట్ర ఉద్యానవనశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు**

చిత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త:
జిల్లాలో మామిడి రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత కుమార్‌లు బుధవారం గంగాదరనెల్లూరులోని జైన్ గుజ్జు పరిశ్రమ, గుడిపాల మండలంలోని ఫున్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గుజ్జు పరిశ్రమ, చిత్తూరు అర్బన్ పరిధిలోని శ్రీరామ్ ఫుడ్ గుజ్జు పరిశ్రమలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు ఫ్యాక్టరీలకు మామిడి తరలించడానికి మామిడి కాయలను తీసుకువచ్చిన రైతులతో మాట్లాడుతూ మామిడి రైతుకు ప్రభుత్వం న్యాయం చేయడానికి కృషి చేస్తోందన్నారు. ఫ్యాక్టరీల వద్ద రైతులకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించాలని ఈ సందర్భంగా వీరు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మామిడి రైతులతో మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుండి జిల్లాలో మామిడి సీజన్ ప్రారంభమైందని, జులై, ఆగస్టు నెలాఖరు వరకు మామిడి చెట్లలో చివరి కాయ వుడేంతవరకు వాటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. జిడినెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ వద్ద కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మామిడి పరిస్థితిని పరిశీలించడానికి రాష్ట్ర స్థాయి నుండి ఉద్యానశాఖ, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్ వచ్చారని, మామిడి కాయలకు సంబంధించిన ప్రతి అంశంను ఆన్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. మామిడి కొనుగోలుపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదన్నారు. జైన్ ఫ్యాక్టరీలు రెండు యూనిట్లలో రోజుకు 1,200 మెట్రిక్ టన్నులు క్రష్ జరుగుతున్నదని, రోజుకు ఫ్యాక్టరీ లోపలికి 200 ట్రాక్టర్లు లోపకలికి వెళ్ళి రావడం జరుగుతున్నదన్నారు. మామిడి రైతులకు టోకెన్లు ఇచ్చి పంపుతున్నామని, జిల్లాలో ప్రస్తుతం 35 నుండి 40 శాతం హార్వెస్ట్ చేయడం జరుగుతున్నదన్నారు. ఈ నెలాఖరు నాటికి 50 శాతం హార్వెస్ట్ అవుతుందని, జులై మొదటి వారం అనంతరం 60 శాతం హార్వెస్టింగ్ జరుగుతుందన్నారు. ఆపై మామిడి ట్రాక్టర్ల లోడ్లు తగ్గుముఖం పట్టే అవకాశం వుంటుందన్నారు. ఈ మామిడి సీజన్‌లో జిల్లాలో కొన్ని సమస్యలు తలెత్తడం జరిగిందని, అన్ని జిల్లాలు, రాష్ట్రాల్లో ఈ సమస్యలు వున్నాయన్నారు. తమిళనాడు, కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర ప్రతి చోట రెండు మూడు టన్నులు రావాల్సివస్తే ఈ సీజన్‌లో ఐదు టన్నుల వరకు వచ్చిందని, అలాగే పల్ప్ ఫ్యాక్టరీల వద్ద గత సీజన్‌లో ఉత్పత్తి చేసిన పల్ప్ నిల్వలు అలాగే వుండటంతో సమస్యలు అధికం అయ్యాయన్నారు. మామిడి డిమాండ్, సప్లై గ్యాప్ వల్ల సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కేజీపై రూ.4 సబ్సిడీ అందిస్తోందని, ఈ మొత్తంను రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తోందన్నారు.

## కాసుల్లేక కన్నీరెడుతున్న తొట్టంబేడు చెరువులు

**పదేళ్ళుగా ప్రతిపాదనలే తప్ప: నిధుల్లేవు .. నిధుల వేటలో ఎంఎల్ఏ**





**శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని చెరువులు మరమ్మత్తులకు నోచుకోకుండా ఆనకట్టలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తూములు ధ్వంసమయ్యాయి. ఇక పంట కాలువల పరిస్థితి సరే సరి. ఈ మండలంలో చెరువులు అధిక శాతం ఓ వైపు స్వర్ణముఖి నది ద్వారా మరి కొన్ని తెలుగుగంగతో నిండుతున్నాయి. చెరువుల్లో నీటికి కొరత లేదు. కానీ మరమ్మత్తులకు నిధుల్లేక కన్నీరెడుతున్నాయి.పదేళ్ళగా ప్రతిపాదనలే తప్ప కాసులు రావటం లేదు.**

తొట్టంబేడు,జూన్ 25 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ఇరిగేషన్ శాఖ పరిదిలో 38 చెరువులు ఉన్నాయి.ఈ చెరువుల కింద సుమారు 5వేల ఎకరాల్లో రెండు కార్లు పంటలు పండిస్తున్నారు. సాగునీటికి కొరత లేదు.వర్షాకాలం స్వర్ణముఖి నది నుంచి చెంబేడు కాలువ ద్వారా పుష్కలంగా నిరు వస్తుంది. ంరెండవ పంటకు తెలుగుగంగ నుంచి ఆదుకుంటున్నారు. కానీ చెరువుల పరిస్థితే ఆగమ్యగోచరంగా మారింది. మండలంలోని 38 చెరువుల్లో 20శాతం తెలుగుగంగ నిరందిస్తూ రైతుల భూములను సస్యశ్యామలం చేస్తుంది. ఇతర మండలాల్లో వ్యవసాయ భూములు 'రియల్ ఎస్టేట్లు' గా మారగా తొట్టంబేడు మండలంలో మాత్రం అలాంటి పరిస్థితి లేదు. వ్యవసాయం పచ్చగా సాగుతుంది. ఇక ఈ చెరువుల పరిస్థితి పరిశీలిస్తే కట్టలు శిథిలమయ్యాయి. తూములు మరమ్మత్తులకు నోచుకోక ధ్వంసం అయ్యాయి. కలుజుల పరిస్థితి పూడిక తీయ మూసుకు పోయాయి. కొన్ని చెట్లు నీరందించే కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దాంతో నీరుకూడా సక్రమంగా చేరటం లేదు. మండలంలోని పెద్ద చెరువుల పరిస్థితి పరిశీలిస్తే ఇంత అధ్వాన్నామా? అని అనక తప్పదు.

**పదేళ్ళుగా పైసలు రాని దుస్థితి:**

తొట్టంబేడు మండలంలోని చెరువు మరమ్మత్తులకు సుమారు పదేళ్ళుగా ఇరిగేషన్ శాఖ ఏ ఏడాది కా ఏడాది అంచనా ప్రతిపాదనలు తప్ప ప్రభుత్వం నుంచి పైసలు రాలటం లేదు. ఇక్కడ చెరువుల ఆధునీకరణను 2000లో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ఆధునీకరించారు. తరువాత 2014 వరకు బొటాబొటిగా నిధులు రావటం తాత్కాలిక మరమ్మత్తులతో కాలం గడుస్తుంది. ఆ తరువాత సుమారు పదేళ్ళుగా పైసలివ్వటం లేదు. తుఫాన్లు వచ్చినపుడు ధ్వంసమయ్యే చెరువు కట్టలకు 'ఉంగరపు కట్టలు' వేయటం తప్ప శాశ్వత మరమ్మత్తులకు నిధులు ఇవ్వటం లేదు. ఈ మండలంలోని చెరువుల మరమ్మత్తులకు రూ.39కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు మంజూరు కాలేదు.దాంతో చెరువుల పరిస్థితిపై ఇరిగేషన్ అధికారుల్లో కూడా ఆందోళన చోటు చేసుకుంది. అధిక ఆయకట్టు కల్గిన డైనేడు చెరువు దయనీయస్థితిలో ఉంది. పలు చెరువుల ఇంకా పిచ్చిమొక్కలతో నిండి ఉంది. రైతులు వర్షాకాలం ఏదైనా ప్రమాదం జరిగితే చెరువు వద్దకు వెళ్ళటానికి దారి కూడ లేకుండా ముళ్ళ చెట్లు,పిచ్చిమొక్కలతో నిండాయి.

**ఎంఎల్ఏ పరుగులు . . .**

మండలంలోని చెరువుల దుస్థితి రైతుబిడ్డగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఎరుగుదురు.కాబట్టి అధికారులు రూపొందించిన అంచనా ప్రతిపాదనల నివేదికలను సంకన పెట్టుకొని మంత్రి వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. తిరుపతిజిల్లాలోని వ్యవసాయం ప్రధానంగా ఉన్న మండలానికి నిధులు కేటాయించాలని సంబంధిత మంత్రికి మొరబెట్టుకుంటున్నారు.విడుదల చేస్తున్న నిధులు సిబ్బంది జీత భత్యాలకే సరిపోతుందని ప్రత్యేక గ్రాంటు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. మరి ఇరిగేషన్ శాఖ మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం

### అమ్మవారి ఆలయంలో

## కాలుజారిపడి ఐదుగురి భక్తులకు గాయాలు

**- ఒకటిన్నరగంట తరువాత ఆలస్యంగా అంబులెన్స్**

**- అమ్మవారి ఆలయంలో కానరాని తితిదే అంబులెన్స్**





తిరుచానూరు, జూన్ 25, ప్రభాతవార్త:
తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం లో వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు భక్తులు జారిపడి గాయాలు పాలయ్యారు. బుధవారం మధ్యాహ్నం తిరుచానూరు పద్మా వతి అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో కురిసినటువంటి తేలికపాటి వర్షానికి కాలు జారిపడి వివిధ ప్రాంతాలకు చెందిన అమ్మవారి భక్తులు గాయాలు పాలయ్యారు. గతంలో వేసవి సందర్భంగా భక్తులు పాదాచార్లకు అధిక ఉష్ణోగ్రతల కారణంగా చలవ వర్ణాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు నడయాడు ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగింది. వేసవి సందర్భంలో భక్తులకు ఎంతగానో ఉపయోగపడే ఈ చలవ వర్ణాలు తేలిక పాటి వర్షాలకు జిగురుగా మారడంతో వాటిపై నడిచే భక్తులు ఎక్కువ సంఖ్యలో జారిపడి గాయాలు పాలవుతున్నారు. ఇందులో అధిక బరువు కలిగిన వారు, వయోవృద్ధులు తీవ్ర గాయాలు పాలయ్యారు. గాయాలు అయిన భక్తులలో తమ ప్రైవేటు వాహనాలు కలిగిన భక్తులు వెంటనే తమ వాహనాల్లో ఆసుపత్రికి తీసుకెళ్లారు.అయితే స్వంత వాహనాలు లేని భక్తులు అంబులెన్సు కోసం నిరీక్షణ తప్పలేదు. ఒకటిన్నర గంట సేపు అంబులెన్సు ఆలస్యంగా రావడంతో నడుముకు గాయమైన భక్తుడు పడినచోటు నుండి కదలకుండా నొప్పులతో విలపించడంతో పలువురు భక్తులు,స్థానికులను కలిచివేసింది.

### నగరంలో పర్యటించిన

## చెప్కో అడ్వైజరీ కమిటీ బృందం

**- మురుగునీటి శుద్ధి విధానాన్ని ప్రశంసించిన బృంద సభ్యులు**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 25, ప్రభాతవార్త
తిరుపతి నగరంలో భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారం కొరకు డిల్లీ నుండి తిరుపతికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మోర్యతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అమృత్‌లో భాగంగా యుజిడి నెట్వర్క్ ప్రధాన పైప్ లైన్ మెయిన్ లైన్ సమస్యలను పరిష్కరించేందుకు ఢిల్లీ నుంచి మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ అఫైర్స్ అండ్ అమృత్‌లోని చెప్కో విభాగం అడ్వైజరీ కమిటీ సభ్యులైన చౌరాసియా, అమిత్ లు తిరుపతికి చేరుకున్నారు. బుధవారం ఉదయం భూగర్భ డ్రైనేజి యుజిడి నెట్వర్క్ ప్రధాన సమస్యగా ఉన్న రేణిగుంట రోడ్డులో భూమిలోకి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన పైప్ లైన్ చాలా కాలం క్రితం ఏర్పాటు చేశారని, ప్రధానంగా ఉన్న సమస్యలను, తదితర విషయాలను కమిషనర్ అడ్వైజరీ కమిటీ బృందానికి వివరించారు. అనంతరం సభ్యులు నెట్వర్క్ ప్రాబ్లం ఉన్న అన్ని ప్రాంతాల్లో పరిశీలించి సమస్య పరిష్కారం కొరకు చేయాల్సిన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అలాగే తూకివాకం వద్ద నున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అడ్వైజరీ కమిటీ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, ఏ.ఈ. శిల్ప, మస్తాన్, తదితరులు ఉన్నారు.

## పీజీసెట్ లో 88.60శాతం ఉత్తీర్ణత

**- ఫలితాలు విడుదల..ఎస్వీయూ రీజియన్ లో 87.07శాతం ఉత్తీర్ణత.**

**- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అర్హత సాధించిన 89.94శాతం మంది ..**

**- జాగ్రఫీ, జనరల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్**



తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాతవార్త
ఎస్వీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీలలో 143 పీజీ కోర్సులలో సీట్ల భర్తీ కోసం ఈనెల 9 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించిన ఏపీపీజీ సెట్ ఫలితాలు బుధవారం విడుదల చేశారు. ఆన్లైన్ లో విద్యాశాఖ మంత్రి విడుదల చేసిన అనంతరం ఎస్వీయూలో వీసీ,పీజీసెట్ ఛైర్మన్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతినాయుడు, కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సబ్జెక్టుల వారీగా ఫలితాలను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 21995 మంది హాజరుకాగా 19,488 మంది అర్హత సాధించి 88.60శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు.ఎస్వీయూ రీజన్ లో 5,764మంది పరీక్ష రాయగా 5,019 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1422మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1279 మంది పీజీ సెట్లో అర్హత సాధించారు.ఇందులో జాగ్రఫీలో చిత్తూరు జిల్లాకు చెందిన దివ్వేష్ రెడ్డి,జనరల్ టెస్ట్ లో చిత్తూరు జిల్లాకు చెందిన ఎం ప్రేమ్ కుమార్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు.

**- సీట్లు 25వేలు... సెట్ లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 19వేలు**

రాష్ట్రంలోని అన్ని వర్సిటీలో 25వేలకు పైచిలుకు పీజీ సీట్లు ఉండగా ఏపీ పీజీసెట్ లో అర్హత సాధించిన అభ్యర్థులు 19,488మంది ఉన్నారు.కనీసం ఒకసీటుకు ఒక అభ్యర్థి కూడా పోటీ లేకపోవడం విశేషం.2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీలలో పీజీ అడ్మిషన్లు భారీ స్థాయిలో పడిపోనున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.దీంతో వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకమేనంటూ మేధావి వర్గాలు, విద్యానిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో యస్వీయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సుధారాణి,ఆచార్య పద్మావతి,ఆచార్య నరసయ్య,ఆచార్య శ్రీనివాసులు,డీన్లు ఆచార్య చంద్రాయుడు, ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహా పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఏపిపిజిసెట్2025 కార్యాలయ సిబ్బంది కామేశ్, నాగభూషణం, సుకుమార్,డా వీరభద్ర, డా వీరనాచారి,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి మజిలికి తిప్పలు తప్పవా?

**ఏళ్ళతరబడి స్థలం కోసం అభ్యర్థనలు**



తెలుగుగంగ కాలువ మీదుగా శవాన్ని మోసుకెళుతున్న దృశ్యం

తొట్టంబేడు,జూన్ 25 ప్రభాతవార్త
తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి పంచాయతీలోని కల్లిపూడి గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానం లేక తిప్పలు పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. బుధవారం ఓ వ్యక్తి మృతి చెందగా ఆతన్ని శ్మశానానికి చేర్చటానికి అవస్థలు పడ్డామని వాపోయారు. శవాన్ని తెలుగుగంగ కట్ట మీదుగా దాటించాల్సి ఉంటుందని వివరించారు. పశువుల బాటలో నడవాలంటే ఎక్కడ తప్పి గంగ కాలువలో పడతామో భయపడుతున్నామని వివరించారు. తెలుగుగంగ కాలువలో నిండుగా నీరు పారుతుందని పడితే ఇక దొరికే పరిస్థితి లేదని వాపోతున్నారు.గ్రామం నుంచి తెలుగుగంగ కాలువ వరకు శవాన్ని పంట పొలాల్లో తీసుకెళ్ళాలి అక్కడ నుంచి తెలుగుగంగ కాలువ మీద నడవాలి.శవాన్ని చేర్చటం అటుంచితేమరే ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్థులు తల్లడిల్లుతున్నారు.ఈ సమస్యను ఎన్నో సంవత్సరాలుగా పాలకుల దృష్టికి తెస్తున్నా ప్రయోజనం లేదని వివరించారు. స్థానిక శాసనసభ్యులు స్పందించి కల్లిపూడి గ్రామ ప్రజలకు శ్మశానం స్థలం కేటాయించాలని లేదా దారి సదుపాయం కల్పించాలని కోరారు.

## ఇవిఎం గోడౌన్‌కు పటిష్ట నిఘా

**- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త: కలెక్టరేట్ అవరణలో నిర్మించి ఇవిఎంలను భద్రపరచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ట నిఘా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఇవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో వున్న ఇవిఎం గోడౌన్‌ను బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇవిఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరచిన ఇవిఎం యంత్రాలు, బియులు, సియులు, వివిప్యాట్‌లు, అక్కడి భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇవిఎంలపై అడిగిన సందేమాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకిటీల సురేంద్రకుమార్(తెలుగుదేశం), అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), ఉదయ్‌కుమార్(వైఎస్ఆర్‌సిపి), పరదేశి(కాంగ్రెస్), యశ్వంత్(జనసేన), ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ రాజేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది మనోజ్‌కుమార్, ఉమాపతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కాణిపాకం, జూన్ 25 ప్రభాతవార్త:
రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వినయ్‌చంద్ బుధవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం



సూళ్లూరుపేట, జూన్ 25 ప్రభాతవార్త
సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. బుధవారం ఉదయం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వీలైనంత వరకు పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరానగర్‌లో ప్రజలకు ఇళ్ల పట్టాలు లేకపోవడంతో వారు తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉన్నామని, దేవాలయ భూముల పేరుతో తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ విషయమై అధికారులతో చర్చించి వీలైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ చెంగాళమ్మ గుడి సమీపంలో కాళంగి నదిపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు.

## గ్రానైట్ క్వారీలో బండరాయి పడి వ్యక్తి పరిస్థితి విషమం

కుప్పం జూన్ 25 ప్రభాతవార్త
కుప్పం మున్సిపల్ పరిధిలోని వడ్డిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న ఓ గ్రానైట్ క్వారీలో బండరాయి మీద పడటంతో ఓ కార్మికుడి పరిస్థితి విషమంగా మారింది. మరో కార్మికుడికి గాయాలైనట్లు సమాచారం. వివరాలు ఇలా ..కుప్పం మున్సిపాలిటీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యక్తి వడ్డిపల్లి వద్ద గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది .ఈ క్వారీలో పనిచేసేందుకు గుడిపల్లి మండలం పాపానూరుకు చెందిన రాజా, శాంతిపురం మండలం దేవనపల్లి చెందిన రాజప్ప అనేవారు కూలీలుగా వచ్చారని తెలిసింది. బుధవారం వీరు క్వారీలో పనిచేస్తుండగా బండరాయి మీద పడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిలో రాజా రెండు కాళ్లు కోల్పోయినట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన వారిని నిర్వాహ కులు క్రిష్ణగిరిలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. .

## పీజీఆర్ఎస్ పెండింగ్ వినతులపై దృష్టి సారించండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి కలెక్టరేట్, జూన్ 25 ప్రభాతవార్త :
పీజీఆర్ఎస్ పెండింగ్ వినతులపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో డీఆర్వో నరసింహులుతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గురువారం రాష్ట్ర స్థాయిలో మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని సీఎం ప్రారంభించనున్నారన్నారు. జిల్లాలో కూడా జిల్లా, మండల, నియోజక వర్గ కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడీఎస్, డీఆర్డీఏ, ఎక్సైజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది, అలాగే మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎస్సై,సీఐలు, సీడీపీవోలు, వెలుగు, సీసీలు, ఎక్సైజ్ ఇనిస్పెక్టర్లు, ఎంఈవోలు, జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా అధికారులు, జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అరగొండ కొత్తబస్టాండు మరమ్మతు పనులు ప్రారంభం

**తవణంపల్లె, జూన్ 25 ప్రభాతవార్త:**

ఎన్నో ఏళ్లుగా అరగొండ కొత్త బస్టాండు మరమ్మతు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇది కుంట కాదు...అరగొండ కొత్త బస్టాండే... అన్న శీర్షిక గత నెల 21న వార్త దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం విధితమే.గత 15 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండు సీసీ రోడ్డు అధికారులు నిర్లక్ష్యం కారణంగా వర్షం పడిన సమయంలో వరదనీరు బస్టాండు బయటకు వెళ్ళేందుకు వీలు లేకుండా ఇంజనీరింగ్ అధికారులు సీసీ రోడ్డు నిర్మించడంతో నడి బస్టాండులో సుమారు ఒక అడుగు లోతు వర్షపు బురదనీరు నిలిచిపోయి బస్టాండు కుంటను తలపిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈదారిన వెళ్ళే సుమారు 20 పైగా గ్రామాల ప్రజలు, వాహనదారులు, చిరు వ్యాపారులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు. దీనిపై స్పందించిన స్థానిక సర్పంచ్ టి.మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి ఏ.మురుగేశన్‌లు బస్టాండు మరమ్మత్తు పనులకు చర్యలు చేపట్టారు. ఈమేరకు ప్రభుత్వ అనుమతులు తీసుకుని సుమారు 3 లక్షల రూపాయల వ్యయంతో మరమ్మత్తు పనులు చేపట్టేందుకు బుధవారం ప్రత్యేకపూజలు చేసి పనులను

**వార్తకు స్పందన...**

ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మల్లుదొరై ప్రశాంత్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు**

కొత్త బస్టాండులో మరమ్మత్తు పనులు చేపడుతుండడంతో ఈనెల 26 నుండి జూలై 25 వరకు అధికారుల అనుమతితో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు సర్పంచ్ టి.మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి ఏ.మురుగేశన్‌లు తెలిపారు. ఈమేరకు సరకల్లు, బంగారుపాళ్యం, మాధవరంకు చిత్తూరు నుండి వెళ్లే వాహనాలు అరగొండ కొత్తబస్టాండు, ఏ.గొల్లపల్లె, గాజులపల్లె మీదుగా వెళ్ళాలని తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

## రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ

**కుప్పం, జూన్ 25 ప్రభాతవార్త**



మండలంలోని చెక్కునత్తం రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు ప్రభుత్వం రాయితీతో అందించే వేరుసెనగ విత్తనాలను రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, సర్పంచ్ పెరుమాళ్, ఎఒ ఫయాజ్ బాషాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వేరుసెనగ పంటసాగు చేయాలని పేర్కొంటూ తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు కనకరాజు, బీరప్ప, నాగరాజు, రమేష్, బాలు, వెంకటాచలం, మాదేష్, విఎఎ జయసుధ, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు ప్రభుత్వం చర్యలు

**కుప్పంరూరల్, జూన్ 25 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు జెఎంసి మురళి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ములకలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎస్ఎంసి ఛైర్మన్ కనకరాజుతో కలసి విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేశారు. విద్యాసంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫా ం, షూలు అందించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిమెంట్ ఫ్యాక్టరీలకు ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు

**– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు – త్వరలోనే డంపింగ్ యార్డ్‌లో ప్లాంటేషన్ పనులు !!**

**కుప్పం, జూన్ 25 ప్రభాతవార్త**





కుప్పం మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తలోంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి సిమెంట్ ఫా ్యక్టరీలకు పంపుతున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన సంస్థ టెండర్ ద్వారా కుప్పం డంపింగ్‌యార్డులో ఉన్న చెత్త, వ్యర్థాలను వేరుచేస్తోందన్నారు. జూలై 15వతేది లోగా డంపింగ్‌యార్డులో ఉన్న పూర్తి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం డంపింగ్‌యార్డు ప్రాంతంలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు చేపట్టి పచ్చదనంను వృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతినిత్యం కుప్పం పట్టణంలో పగలు, రాత్రి రెండుపూటల చెత్తసేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మున్ముందు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పట్టణ సుందరీకరణ పనులు చేపడ్తామన్నారు.

## విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ

**కుప్పంరూరల్, జూన్ 25 ప్రభాతవార్త**



మండలంలోని కంగుంది గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం తరపున సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లను దేశం నేతలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మైనార్టీ సెల్ ఉపాధ్య క్షుడు మునాఫ్, పార్టీ అధ్యక్షుడు షరీఫ్‌లు మాట్లా డుతూ సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు కిట్లను అందిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట మేరకు తల్లికివందనం పథకం అమలు చేశారన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న సినీ నిర్మాత బండ్ల గణేష్

**కాణిపాకం, జూన్ 25 ప్రభాతవార్త:** ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో



వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

**గంగవరం,జూన్ 25 ,ప్రభాతవార్త :**

కుటుంబ కలహాలతో 10 రోజుల క్రితం ఆత్మహత్యయత్నానికి వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందినట్లు గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ పేర్కొన్నారు.సిఐ కథనం మేరకు వివరాలిలా..మండలంలోని కలగటూరు గ్రామానికి చెందిన బాలాజీ(34) అనే వ్యక్తికి చౌడేపల్లె మండలం దుర్గసముద్రం పంచాయతీ గుటకపల్లెకు చెందిన భాగ్యలక్ష్మితో తొమ్మిదేళ్ళ క్రితం వివాహం జరిగింది.ఈ నేపథ్యంలో భార్యతో తరచూ ఘర్షణలు పడేవారని తెలిపారు.ఈ క్రమంలో 10 రోజులు క్రితం ఆర్థిక ఇబ్బందులతో,భార్యతో తీవ్ర స్థాయిలో ఘర్షణలు పడి జీవితంపై విరక్తి చెంది పురుగులు మందు సేవించి అపస్మారక స్థితిలో పడిపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బుధవారం ఉదయం బాలాజీ పరిస్థితి విషమించడంతో తిరుపతి రూయాకి తరలిస్తుండగా బాలాజీ మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు

## నేటి నుంచి వారాహీదేవీ నవరాత్రులు

**చౌడేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త**

మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో ఈనెల 26నుంచి జూలై 4వరకు వారాహీదేవీ నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకురాలు, నిర్మాణకర్త శ్రావణి, వినోద్‌కుమార్‌రెడ్డిలు తెలిపారు. నవరాత్రులందు ఆలయంలో ప్రతి రోజూ వివిధ రకాల కార్యక్రమాలుంటాయని వారు వివరించారు. భక్తాదులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## దేశం నాయకుడు లోకయ్యకు పైనేని మురళీ ఆర్థిక సహాయం

**శ్రీరంగరాజుపురం, జూన్ 25 ప్రభాతవార్త:**



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎస్ఆర్ పురం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లోకయ్యకు బుధవారం మండల తెలుగుదేశం యువ నాయకుడు పైనే మురళీ ఆర్థిక సహాయం అందజేసి ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్లతో మాట్లాడుతూ లోకయ్యకు మెరుగైన వైద్యం అందించి త్వరగా ఇంటికి వచ్చేలా చేయాలని కోరారు.

## పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన

**శ్రీరంగరాజపురం, జూన్ 25 ప్రభాతవార్త:**



జిడి నెల్లూరు నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల ఏర్పాటు కోసం బుధవారం చెన్నై నుండి పాలీ హౌస్ గ్రూప్ సంస్థ, పాల్కాట్ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇళంగో నారాయణన్ చిన్నవేపంజేరి, బాలగంగనపల్లి, ఎస్ఆర్ పురం, పాతపాళ్యం, దాసరిగుంట గ్రామాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. ఈ సంస్థ జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో 1000 ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. ఈ ప్రాంతాల్లో కనీసం పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వెయ్యి ఎకరాల మేరకు స్థలం లభ్యం అయితే ఆ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి అవకాశం వుంటుంది. ఈ మేరకు తహసిల్దారు లోకనాధంపిళ్ళై స్థలాలకు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ప్రతినిదులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిడినెల్లూరు తహసిల్దారు తులసీరామ్, ఎస్ఆర్ పురం తహసిల్దారు లోకనాధపిళ్ళై, మండల సర్వేయర్ సునీత, ఎమ్మెల్యే పిఎ చంద్రశేఖర్, అదికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు రేషన్ డోర్‌డెలవరీ

**పాలసముద్రం, జూన్ 25 ప్రభాతవార్త:**



ప్రభుత్వ ఆదేశాల మేరకు వయోవృద్ధులు, వికలాంగులు, బెడ్ రెస్ట్‌లో వున్న వారికి రేషన్ డీలర్లు ఈ నెల 30వ తేదీలోపు రేషన్‌ను డోర్ డెలవరీ చేయాలని తహసిల్దారు అరుణకుమారి ఆదేశించారు. తహసిల్దారు అరుణకుమారి బుధవారం తహసిల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దారు మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 24 రేషన్ షాపులు వున్నాయని, వీటి పరిధిలో 96 మందికి డీలర్లు డోర్ డెలవరీ చేయాల్సి వుంటుందన్నారు. రేషన్ షాపుల వారీగా ఏ షాపు పరిధిలో ఎంత మంది రేషన్‌కార్డుదారులకు రేషన్‌ను డోర్ డెలవరీ చేయాలనే విషయం తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి డీలరు షాపు ముందు ధరలు సూచించే బోర్డులతో పాటు కార్డుదారులకు అందుబాటులో వుండి నిత్యవసర వస్తువులను సకాలంలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దారు టి.రిషీవర్మ, ఆర్ఐ దేవి, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

**– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

**– బాధితులకు 12లక్షల రూపాయల చెక్కులు పంపిణీ !!**




**కుప్పం, జూన్ 25 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఉన్న పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో కుప్పం మున్సిపాలిటీలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఏడుమంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన 12లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజల ఆరోగ్య, ఇతర సమస్యలపై సిఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారన్నారు. ప్రజలు కూడా మంచి వైద్య సేవలు అందించే ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. త్వరలోనే కుప్పం ఆస్పత్రిలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను సిఎం ప్రారంభిస్తారన్నారు. తద్వారా కుప్పం ప్రాంత ప్రజలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రుల ద్వారా సైతం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సత్యేంద్రశేఖర్, ప్రతాప్, రవి, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కడ సభ్యురాలు సుగుణమ్మ, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, మహిళా నేత తిరుమగళ్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వేడుకుంటున్నాం... వినిపించలేదా..?

**– 12వ రోజు నిరసనలో కార్మికుల ఆగ్రహం**

**పుంగనూరు, జూన్ 25, ప్రభాతవార్త**



మున్సిపాలిటీలో దశాబ్దాల పాటు వెట్టి చాకిరి బతకలేపోయి వేదనలు అనుభవిస్తున్నామని, జీతాలు పెంచాలని వేడుకుంటున్నప్పటికీ ప్రభుత్వానికి వినిపించడం లేదని మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో 12వ రోజు నిరసన కార్యక్రమం కార్మికులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శనగా వెళ్లి తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పెన్షన్ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న కార్మికులు మాత్రమే ఈ విధంగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండు వారాలుగా మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ కార్మికులు చేస్తున్న ఆందోళన ప్రభుత్వం చెవులకు ఎక్కకపోవడం విచారకరమని, త్వరలో ఆందోళనలు తీవ్ర రూపం ధరించేలా చేస్తామని ప్రకటించారు.

## దేశాన్ని అంధకారం చేసిన ఎమర్జెన్సీ

**– ఎస్సీ మోర్చా బి.నరసింహులు**

**పుంగనూరు రూరల్, జూన్ 25, ప్రభాతవార్త**



భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశానికి ఎమర్జెన్సీ గురించి ఇరవై ఒక్క నెలల పాటు భారతదేశ ప్రజలను అంధకారంలోకి నెట్టివేసిందని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన ఎమర్జెన్సీకి నేటితో 50 ఏళ్లు నిండిపోయిందన్నారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచమంతా సాంకేతికత నేర్చుకునే తొలి దశలో ఇందిరా గాంధీ చేసిన దుర్మార్గపు ఎమర్జెన్సీ వల్ల భారతదేశం పాతిక సంవత్సరాల వెనక్కు వెళ్లిపోయిందన్నారు. కానీ ఆనాడు జరిగిన పర్యవసానాలు గురించి యువతరానికి తప్పక తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పత్రికలపై సెన్సార్‌షిప్, రాజకీయ నాయకులు సంఘసంస్కర్తలు విద్యార్థులు మహిళల అరెస్టులు, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఇలా ఎన్నో దురాగతాలు 21 నెలల్లో ప్రజలు చవిచూశారు. ఒక స్వార్థపూరిత నాయకురాలి నిరంకుశ మనస్తత్వం వల్ల భారత దేశపు ప్రజాస్వామ్యానికి తూట్లు పడింది. అందుకే జూన్ 25 వ తేదీని సంవిధాన్ హత్యా దివాస్‌గా పరిగణిస్తాం.

## ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

**– ఆర్జేడి నాగలింగారెడ్డి**

**పుంగనూరు, జూన్ 25, ప్రభాతవార్త**



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా ప్రమాణాలు బాగా పెరిగాయని, ఉన్నత వసతులతో కూడిన విధననించే పాఠశాలనుంచి మరింత ఉత్తమ ఫలితాలు కోసం అధ్యాపకులు విద్యార్థులు కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ ఆర్జెడి నాగలింగారెడ్డి సూచించారు. బుధ వారం ఆయన శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తనిఖీ నిర్వహించారు. కళాశాలకు అందిన నిధులు, సమకూరిన వసతులు, విద్యార్థులకు సకాలంలో అందుతున్న ఉన్నత విద్య తోపాటు మరిన్ని రికార్డులను ఆయన పరిశీలించారు. మంచి అధ్యాపక బృందంతో పాటు మంచి వాతావరణం కలిగిన కళాశాలలో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయి లోకి రావాలని ఆయన సూచించారు ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రేపటి నుండి దిగువమాఘంలో మహాభారత యజ్ఞం

**తవణంపల్లె, జూన్ 25 ప్రభాతవార్త:**

మండలంలోని దిగువమాఘంలో ఈనెల 27 నుండి మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి. గ్రామస్థులు తెలిపారు. ప్రతి ఏటా గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో గ్రామస్థులు 21 రోజుల పాటు ఈకార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈసందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈనెల 27న గరిగ ఉత్సవం, ధ్వజారోహణం కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈమేరకు ఈనెల 27 నుండి జూలై 21 వరకు యం.పూర్ణ భాగవతారిణీచే పగలు హరికథలు, కాణిపాకం మురుగన్ నాట్యమండలి వారిచే రాత్రి నాటక ప్రదర్శనలు వుంటాయని ఉమాపతిరెడ్డి తెలిపారు.

## గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ మృతి

**సదం, జూన్ 25, ప్రభాతవార్త**



సదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. జయ్ కుమార్ రెడ్డి భార్య పులిచెర్ల ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ వై.ఉమామహేశ్వరి బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమె గుండె పోటు గురయ్యారు. చికిత్స తీసుకుంటు మృతి చెందారు. ఆమె మృతికి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి ,తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మలు సంతాపం తెలిపారు.

## పెద్దపంజాణి మండల నూతన తహశీల్దార్‌గా హనుమంతు.

**పెద్దపంజాణి జూన్25 ప్రభాతవార్త:**

పెద్దపంజాణి మండల నూతన తహశీల్దార్‌గా హనుమంతు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో చౌడేపల్లి తహశీల్దార్‌గా పనిచేసి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో మండలంలోని రెవెన్యూ సమస్యలను గ్రామ రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పాఠశాలలకు,కాలేజీలకు వెళ్ళే విద్యార్థులకు అవసరమైన కుల,ఆదాయ మెదలగు ధృవీకరణ పత్రాలను వెంటనే అందించాలని,సమయం ఉందని నిర్లక్ష్యం వహించవద్దని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ప్రజా ప్రతినిధులు,అధికారులు మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు సహకరించాలని సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలని పేర్కొన్నారు.గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన అనిల్ కుమార్ రెడ్డి డిప్యూటి తహశీల్దార్‌గా పలమనేరుకు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ హనుమంతును అలాగే బదిలీ అయిన అనిల్‌కుమార్ రెడ్డిని గ్రామ రెవెన్యూ అధికారులు,కార్యాలయ సిబ్బంది దుశ్శాలవతో పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ యోగేష్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ కుమార్,గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం అధ్యక్షులు సుబ్రమణ్యం ఆచారి,వీఆర్వోలు క్రిష్ణంరాజు.శివ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

***తిరుపతి హెల్త్, జూన్ 25 ప్రభాతవార్త :***



టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంను విజయవంతం చేద్దామని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ అన్నారు. బుధవారం సాధారణ బదిలలో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి తిరుపతిలో అడిషనల్ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శైలజ జిల్లా క్షయ నివారణ ఉద్యోగులతో సమీక్షను నిర్వహించారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ జిల్లాలో టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణకు తన వంతు కృషి చేస్తానని, తిరుపతి జిల్లాను అన్ని ఇండికేటర్‌లలో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. పట్టణాలు, పంచాయితీలలో టీబీ ఛాంపియన్‌ల సహకారంతో టీబీ వ్యాధి మీద అవగాహన కల్పిస్తూ నిర్ధారిత టీబీ పేషంట్‌లకు దాతల సహకారంతో న్యూట్రిషన్ కిట్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.తిరుపతి క్షయ నివారణఉద్యోగులులోకేష్,మురళీ, మొహిద్దీన్, దేవరాజులు, సుకన్య, సౌజన్య, మహేశ్వరి, పాల్గొన్నారు.

## పరిశ్రమల శాఖ జీఎంను సన్మానించిన చాంబర్ ఆఫ్ కామర్స్

**తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నూతనంగా నియమించబడిన జి. చంద్రశేఖర్‌ని తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె.వి చౌదరి, సభ్యులు బుధవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిశ్రమల అభివృద్ధికి తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ వారు సహాయ సహకారాలను అందిస్తామని తెలియజేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశయము మేరకు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేసేందుకు ముఖ్యమంగా ఎంఎస్, ఎంఈల అభివృద్ధికి కావాల్సినటువంటి సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తిరుపతి డిస్ట్రిక్ట్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. రఘురామిరెడ్డి, మధుసూదనరావు, హేమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి ధరలు పతనానికి వైకాపా ప్రభుత్వ విధానాలే శాపం

***మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్***

**తొట్టంబేడు,జూన్ 25 ప్రభాతవార్త**



నేడు మామిడి రైతులు అనుభవిస్తున్న మామిడి ధర పతనానికి గతంలో పరిపాలించిన వైకాపా విధానాలే కారణమని మాజీతొట్టంబేడు వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ జయచంద్రనాయుడు అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఏపిలో నేడు మామిడి రైతులు గిట్టుబాటు ధరలు లేకుండా అల్లాడుతున్నారు.దానికి కారణం గతంలో పరిపాలించిన వైకాపా నాయకుల విధానాలే అన్నారు. వారు అమలు చేసిన విధానాలతో ఫ్యాక్టరీలు నష్టపోయాయి.వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దాంతో ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. మామిడి రైతులు రోడ్డున పడ్డారన్నారు. దాంతో ఈ ఏడాది కూడా మామిడి రైతులకు గిట్టు బాటు ధరను ప్రభుత్వం కల్పించలేకపోయిందన్నారు. నేడు మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవతీసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తోతాపురికి రూ.12లు గిట్టుబాటు ధరను కల్పించారన్నారు.రూ.12ల గిట్టుబాటు ధరలో రూ.8 సంబంధిత ఫ్యాక్టరీలు, రూ.4 ప్రభుత్వం భరించేందుకు నిర్ణయం తీసుకోవటం రైతుల పట్ల ప్రభుత్వానికి గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు.అయితే చాలా చోట్ల ఫ్యాక్టరీలు రూ.8ఇవ్వటానికి సుముఖంగా లేదని వారిని ఒప్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## క్లస్టర్ ఇన్‌చార్జి గోపి

**శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలో క్లస్టర్ ఇన్‌చార్జిగా గాదిపాకుల గోపినాథ్‌ను నియమిస్తూ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు. పార్టీలో కష్టకాలంలో బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డితో నడిచిన గోపినాథ్ సేవలను గుర్తించిన ఆయనను క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించారు.ఆయనకు పలువురు అభినందించారు.

## హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలి:విచారణ జరపాలి




***శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త***శ్రీకాళహస్తిలోని బిసి హాస్టల్‌లో మంగళవారం జరిగిన ఫుడ్ పాయిజన్ సంఘటనకు సంబంధించి ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని బిసివై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ డిమాండ్ చేసారు,బుధవారం ఆయన హాస్టల్‌లో విద్యార్థులను పరామర్శించారు. మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకున్న విద్యార్థుల్లో 16 మంది విద్యార్థులు అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన వారిని రామచంద్రయాదవ్ విచారించారు.ఈ సంఘటనలో బిసి హాస్టల్ సిబ్బంది ముఖ్యంగా ఆసుపత్రి సిబ్బంది చొరవను ఆయన అభినందించారు. విద్యార్థులతో ఆయన మమే కమై విచారించారు. పులిసిన పిండితో తయారు చేసిన ఇడ్లీలు తినటం వల్ల ఇలా జరిగిందన్నారు. ఇడ్లి చాలా పుల్లగా ఉన్నట్లు విద్యార్థులు వివరించారు.బిసి హాస్టల్ జరిగిన సంఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణకు ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్‌లోని విద్యార్థులకు అంది స్తున్న మెస్‌చార్జీలు రూ.38లు మాత్రమే అందజేస్తుందని దీనితో విద్యార్థులకు ఎలా పౌష్టికాహారం అంద జేస్తారని యాదవ్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కనీసం రూ.150లు మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్‌చేసారు.

## శ్రీ ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలి

***పుత్తూరు రూరల్, జూన్ 25 ప్రభాతవార్త:*** పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతో విజయవంతం చేయాలని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు పేర్కొన్నారు. పుత్తూరులో ఆలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిసు_్తన్నామని, అన్ని కులాలకు ఉభయ ప్రధానంలో భాగస్వామ్యం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూలై 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు 18 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో కలసికట్టుగా ఉండి పూర్తి చేయాలన్నారు. ఆలయ ఆవరణలో శ్రీ ద్రౌపదీదేవి అమ్మవారి 40 అడుగుల విగ్రహ ప్రతిష్ట చేపట్టాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారన్నారు.ఈవిగ్రహం ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి తమకు తోచినసాయం అందజేయవచ్చన్నారు.ఆలయ కోవిల్‌కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ యుగంధర్, ఆలయ నిర్వాహకులు, కుల సంఘాల నాయకులు చంద్ర, శివయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీలో ఎమర్జెన్సీపై అవగాహన సదస్సు

**పుత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త :**



ఆధునిక భారతదేశ చరిత్రలో 1975లో విధించిన అత్యవసర పరిస్థితి ఒక చీకటి అధ్యాయం అని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. బుధవారం సంవిధాన్ హత్య దివస్ సందర్భంగా కాలేజీలో ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో ప్రజల ప్రాథమిక హక్కులు రద్దయ్యాయని, పత్రికలపైన సెన్సార్ షిప్ విధించారని, బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారకు 1,50,000 మంది విపక్ష నాయకులను, ప్రజలను జైళ్లలో పెట్టారన్నారు. ఇలాంటి దురదృష్ట కర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత నేటి యువతరంపై వుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసులు, బాబూరావు, అధ్యాపకులు డాక్టర్ పి.సుజన, సావిత్రి, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ జె.కోటేశ్వరరావు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సురక్షితంగా చేర్చే బాధ్యత డ్రైవర్లదే

**మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్**

**సత్యవేడు, జూన్ 25 ప్రభాతవార్త:**



స్కూలు పిల్లలను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని పుత్తూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం శ్రీసిటీలో పలు పాఠశాలలకు సంబంధించిన స్కూలు బస్సులను, ఇతర వాహనాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్లకు పలు సూచనలు ఇచ్చారు. స్కూలు బస్సులను అతివేగంగా నడపరాదన్నారు. స్కూలు బస్సుల నిర్వహణలో విద్యా సంస్థల యాజమాన్యాలు, మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని డ్రైవర్ల పని తీరును, బస్సుల కండీషన్ మెరుగుపరచాలని సూచించారు. అంతకు ముందు పలు వాహనాల సంబంధించిన రికార్డులను పరిశీలించి సక్రమంగా లేని వాటికి సుమారుగా రూ.1,72910,00 జరిమానా విధించినట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## ఐఎన్‌టిఎస్‌ఓ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త



జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఏడాది నిర్వహించే ఐఎన్‌టిఎస్‌ఓ పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటి పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. ఈ మేరకు పాఠశాల నిర్వాహకులు బుధవారం విద్యార్థుల్ని సత్కరించారు. లెవల్ 1 లెవల్ 2 రాయగా అందులో ఆరవ తరగతికి చెందిన లేఖన సాయి(55) సాధించి మొదటి బహుమతిని సాధించారు. లెనోవా ట్యూబ్ ను బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రూపాదేవి విద్యార్థులను ఆశీర్వదిస్తూ చదువుల్లో రాణిస్తున్న మొదటి బహుమతి లేఖ సాయికి మంచి భవిష్యత్తు ఉందన్నారు. రెండవ బహుమతి సాధించిన మోక్షిత(8వ తరగతి) మూడవ బహుమతి చాలిత్య(4వ తరగతి) నాల్గవ బహుమతిగా మోనాలిక,ఐదవ బహుమతి రక్షిత(5వతరగతి చేతన (9వ తరగతి) పొందారని వివరించారు.ఈ పోటీ పరీక్షల్లో 67 మంది గోల్డ్ మెడల్స్‌ను 211 మంది ప్రత్యేక బహుమతులు సాధించి శ్రీకాళహస్తి పేరుతో పాటు విద్యాసంస్థకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని అభినందించారు.

## అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోరు?

**దేశం బిసి నాయకుని ప్రశ్న**

**శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని పాలించిన వైకాపా నాయకుడు నియోజకవర్గంలో అరాచక పాలన అందించారని, ప్రభుత్వ భూములను అప్పనంగా అమ్ముకున్నా ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, ప్రజల పక్షాన పోరాడిన తెలుగుదేశం నాయకులపై కేసులు బనాయించి నేటికి కోర్టుకు తిప్పుతున్నారని రాష్ట్ర తెలుగుదేశం బిసి విభాగం కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు పేర్కొన్నారు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలు,అక్రమణలు,దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వైకాపా పాలన ఐదేళ్ళు జనం భయభ్రాంతుల్ని చేస్తూ పరిపాలించారన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసిన వారికి యాజమాన్య పత్రాలను రెవెన్యూ అధికారులు జారి చేసారు.ఇక శ్రీకాళహస్తి పరిసరాల్లో పంట కాలువలను ఆక్రమించుకున్నారు. పక్కా భవనాలు నిర్మించారు. మంచినీటి గుంటకు సప్లైఛానల్ మూసివేసారు. ఇక ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు యాజమాన్య పత్రాలు జారి చేసిన రెవెన్యూ అధికారులపై ఎందుకు ప్రస్తుతం క్రిమినల్‌చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.శ్రీకాళహస్తి పట్టణం, రాజీవ్‌నగర్‌లలో సాధించిన భూదందాల్లో ఒక్కొ అధికారి రూ.50లక్షల నుంచి రూ.2కోట్లు దండుకున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వ్యవహారంలో లక్షల రూపాయల చేతులు మారాయన్నారు. దీనిపై ఇప్పటికైనా విజిలెన్స్ దృష్టి సారించి నిజనిజాలు నిగ్గుతేల్చాలని ఉమేష్‌రావు డిమాండ్‌చేసారు.

## శివయ్య సేవలో మాజీ రాజ్యసభ సభ్యులు

**శ్రీకాళహస్తి, జూన్ 25 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని బుధవారం మాజీ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ జైన్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పిఆర్ఓ దుర్గా ప్రసాద్ దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. మహిమాన్వితమైన వాయులివగేశ్వరుని దర్శనానికి అతిథుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ రాజ్యసభ సభ్యుడు రాగా కోలా ఆనంద్ పర్యవేక్షణలో బిజెపి నాయకులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వేద పండితులచే ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.పిఆర్ఓ దుర్గా ప్రసాద్, బిజెపి నాయకులు కొండేటి గోపాల్, పట్టణ అధ్యక్షుడు హరిష్‌రెడ్డి,చందూ రాయల్,రవి, శివనాథపాళెంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాఠశాలలపై ఎందుకీ వివక్ష సిపిఎం ర్యాలి

**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 25 ప్రభాతవార్త**



పాఠశాలల విలీనం జనాల్లో తీవ్ర అసంతృప్తి నింపుతుంది. ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలం పల్లంపేట దళితవాడలోని పాఠశాలను పల్లం పాఠశాలలో విలీనం చేయటంపై తీవ్ర అసంతృప్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం సిపిఎం సారథ్యంలో భారీ ఎత్తున ర్యాలి నిర్వహించారు. సుమారు 40 సంవత్సరాలకు పైగా నిర్వహిస్తున్న పాఠశాలలో 60మంది విద్యార్థులుండగా కేవలం 32 మంది ఉన్న పల్లం పాఠశాలలో విలీనం చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పేడు–వెంకటగిరి రహదారిపై సిఎంపి సారథ్యంలో ఆందోళన చేసారు. గ్రామస్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎంపిడిఓకు వినతి పత్రం అందించారు. 1985 నుంచి పల్లంపేటలో 3,4,5 తరగతుల విద్యార్థులను 3 కిలో మీటర్ల దూరంలోని పాఠశాలలో విలీనం చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.ఈ మార్గం జాతీయ రహదారి. అన్ని మౌళిక సదుపాయాలతో దళిత వాడలోని పాఠశాలను అభివృద్ధి చేయాలని కోరారు.

## మహిళా సర్పంచ్‌లు పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి

**తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త**



పరిపాలనలో మహిళలు జవాబు దారి తనంతో పని చేస్తారని సుపరిపాలన అందించుటకు వారు చిత్తశుద్ధితో జవాబుదారి తనంతో పని చేస్తారని స్థానిక సంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించారని అయితే సర్పంచ్‌లు తమ విధులు బాధ్యతలు,అధికారాలను తెలుసు కో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండలా ల్లోని పంచాయతీల్లో సర్పంచ్‌లుగా మహిళలు గెలిచినా భర్తలే పరిపాలిస్తున్నారు.ఈ నేపథ్యంలో వారికి మూడు రోజుల శిక్షణను తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఎంపిడిఓ అధ్యక్షతన జరిగింది. బుధవారం సమావేశానికి 36 మంది సర్పంచ్‌లకు గాను 33 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా వారికి గ్రామ సభ ప్రక్రియ,విధానాలు, అక్టివిటి, భావ వ్యక్తికరణ నైపుణ్యం ప్రజా స్వామ్య విధుల సులభతరం అక్టివిటి, నాయకత్వం మరియు ప్రభావం ఆక్టివిటి,శిక్షణ అనే అంశాలపై వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 26నుంచి మూడు రోజుల పాటు ఏర్పేడు,బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచ్ లకు తొట్టంబేడు కార్యాలయంలో నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఎంపిడిఓ గుల్షాద్ బేగం వివరించారు.

## ఎమర్జెన్సీలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు

**తిరుపతి(రవాణ),జూన్ 25ప్రభాతవార్త**



1975లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా బుధవారం తిరుపతిలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ జరిగింది. బిజెపి కేరళ రాష్ట్ర కో ఇన్‌ఛార్జి అపరాజిత సారంగి దేశంలో అత్యవసర పరిస్థితి విధించడంఒక చీకటి అధ్యాయమని అన్నారు. ఆమె పాల్గొని పలు అప్పటి పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనంపాటించారు. టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, జల్లిమధుసూదన్, జిల్లా సాంస్కృతిక విభాగం గుండాల గోపీనాథరెడ్డి, నాయకులు కోలాఆనంద్, మునిసుబ్రమణ్యం, సుబ్రమణ్యంయాదవ్, మల్లారపురవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలు సంతోషంగా ఉండాలి

**తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:**



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం కుటుంబంతో కలసి ఆయన విఐపి బ్రేక్‌లో స్వామివారి దర్శనం చేసుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి: ఎంపీడీవో

**సత్యవేడు, జూన్ 25 ప్రభాతవార్త:**



స్వయం ఉపాధి దిశగా స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సత్యవేడు ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపీఎం డా. డాంగే యాదవ్ అధ్యక్షతన గ్రామ సంఘాల లీడర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ భారతదేశ ప్రధాన మంత్రిగా పీవీ నరసింహారావు హయాంలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే 1993లోని డ్వాక్రా సంఘాలు ఏర్పాటైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సత్యవేడులో 1234 స్వయం సహాయక సంఘాలు నడుస్తుందన్నారు. అయితే బ్యాంకులు, గ్రామ సంఘాలు శ్రీనిధి, వంటి వాటిలో తీసుకుంటున్న రుణాలను డ్వాక్రా మహిళలు స్వయం సహాయక ఉపాధిలో పెట్టుబడి పెట్టాలన్నారు. తద్వారా ఆర్థికంగా సంఘాలు బలపడడానికి అవకాశం ఉందన్నారు. కానీ అధిక సంఘాలు ఉపాధి దిశగా వెళ్ళడం లేదన్నారు. శ్రీనిధి ఇన్‌ఛార్జి మేనేజర్ ఆదిల్‌బాషా మాట్లాడుతూ మహిళా సంఘాలు శ్రీనిధి ద్వారా తీసుకుంటున్నా రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సమావేశంలో వెలుగు కో–ఆర్డినేటర్లు శివకుమార్, పయణి, పురుషోత్తం, పుల్లయ్య, మధుసూదన్, మండల మహిళా సమైక్య కోశాధికారి మంజుల, అకౌంటెంట్ కాంచన, పలువురు గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## సర్వేయర్లు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**నింద్ర,జూన్ 25 ప్రభాతవార్త :**



గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని నింద్ర మండల గ్రామ సర్వేయర్ సంఘం డిమాండ్ చేసారు.బుధువారం మండల కేంద్రంలో డిప్యూటి తహాశీల్దారు మాదవిలతకి మండలంలోని గ్రామ సర్వేయర్ వినతిపత్రం అందజేసారు. వారు మాట్లాడుతూ జిఓ యంయస్ నెంబరు1 ప్రకారం హేతుబద్దీకరణలో భాగంగా మిగులు సిబ్బంది అయిన 4722 మంది వియస్‌ల భవిషత్‌లపై సమగ్ర నివేదిక సమర్పించాలి.జిఓ యంయస్ నెంబరు 161 ప్రకారం జిఆర్ 111 నుండి జిఆర్ 11గా హోదా మార్చినందున,పే స్కేల్‌లో తగిన మార్పులు చేయాలి.అన్ని జిల్లాలో సినియర్ లిస్టులను వెంటనే పబ్లిష్ చేయాలి.జిఆర్ 1 కేడర్ స్ట్రింగ్ ఫైనల్ చేయాలి.అర్హత కలిగిన వారు అందరికి పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేయాలి. నేటి వరకు జరిగిన రీ సర్వేలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడదుల చేయాలన్నారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేశర్లు,సచివాలయ సర్వేయర్లు ఉదయ్‌కుమార్,రూపేష్,నవీన్,హరి, అరుణ,దినేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఉద్యోగులకు రెఫరల్ దర్శనాలు ఇవ్వాలి

**–అదనపు ఈఓ చౌదరికి జెఎసి వినతి**

**తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:**



భక్తులకు నిస్వార్థ సేవలందిస్తున్న టిటిడి ఉద్యోగులకు రెఫరల్ దర్శనాలు మంజూరుచేయాలని కోరుతూ టిటిడి ఉద్యోగుల జెఎసి నాయకులు అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కోరారు. బుధవారం జెఎసి నాయకులు గోల్కొండ వెంకటేశం, ఆంజనేయులు, నేతృత్వంలో అదనపు ఈఓ వెంకయ్యచౌదరిని కలసి వినతిపత్రం అందజేశారు. టిటిడి ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఉద్యోగుల రెఫరల్ లెటర్లపై నెలకు 10 టిక్కెట్లు 300 రూపాయలు ఇవ్వాలని, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి రోజుల్లో ఉద్యోగుల రెఫరల్ లెటర్లపై 10మందికి దర్శనం టిక్కెట్లపై స్టాండింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని కోరారు.గదులను కూడా పెంచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అదనపు ఈఓ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

## నిస్వార్థ సేవలకు బహుమానం

**పుత్తూరు రూరల్, జూన్ 25 ప్రభాతవార్త:**

ఉచితంగా ధ్యానం, యోగా ప్రతి ఆదివారం ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తూ పుత్తూరు, పరిసర ప్రాంత ప్రజలకు విశేషంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న త్రినేత్ర పిరమిడ్ దివ్యధ్యాన దేవాలయ సంస్థకు తమవంతు సహకారంగా సోలార్ విద్యుత్ అందిస్తున్నానని వారు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రకటించి వెంటనే కార్యాచరణ చేపట్టి దాదాపు లక్షా యాభై వేల రూపాయలు విలువ చేసే సోలార్ విద్యుత్ ఫలకాలు అమర్చిన పుత్తూరు వాస్తవ్యులు స్వర్ణ రమేష్, ధ్యాన మందిర యాజమాన్యం సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గం - సీఐటీయూ ధర్నా

**పుత్తూరు రూరల్, జూన్ 25 ప్రభాతవార్త:**




రాష్ట్ర వ్యాప్తనిరసనలకు వామపక్షాలు పిలుపు మేరకు విజయవాడలో నిరసన కార్యక్రమం జయప్రదం చేయండి అందులో భాగంగా బుధవారం పుత్తూరు పట్టణంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ ఇరాన్ అమెరికా దాడులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని, ఇప్పటి వరకు భారత్ అవలంభిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమన్నారు. అంతేకాకుండా ఇరాన్‌పై దాడితో ఆయిల్ సంక్షోభం వస్తుంది. దీని వలన దేశ ప్రజలపై భారాలు పడతాయని, అందు వలన భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండివంచాలని వామపక్ష పార్టీలు కోరుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, యాషన్ బాషా, మోసెస్, పాల్గొన్నారు.

## అభ్యాసం చేస్తే చదువు వస్తుంది...

**రేణిగుంట జూన్ 25 ప్రభాతవార్త**



ప్రతి విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ వహించి అభ్యాసం చేస్తే విద్య నేర్చుకోవచ్చని రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేశం అన్నారు. రేణిగుంట పంచాయతీలోని ఆర్ సి ఎం పాఠశాలలో బుధవారం పేద విద్యార్థులకు పద్మ మహిళ మండలి (కడప జిల్లా కాజీపేట) ఆధ్వర్యంలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ పర్యవేక్షణ నందు విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. డబ్బు ఖర్చుపెట్టి ట్యూషన్లకు వెళ్లలేని పేద విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం స్టడీ సెంటర్ ద్వారా చేసి ఇద్దరు టీచర్లు విద్య బోధించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశం మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. పాఠ్యాంశాలను అభ్యసించేటప్పుడు ఏకాగ్రతతో నేర్చుకోవాలన్నారు. ఏకాగ్రతే విద్యార్థులకు మొదటి గురువు అన్నారు. కార్యక్రమంలో జూలియన్ రాజు, సుమ శ్రీలక్ష్మి, శీను, అధ్యాపకులు శౌరి, చిన్నయ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

**నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త :**



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో బుధవారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయలస్వామి ఆలయంలోను అమావాస్యపూజలనుఘనంగాజరిపారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## ఇడుపులపాయ ట్రిపుల ఐటికి ఇద్దరు విద్యార్థినిలు ఎంపిక

**నారాయణవనం, జూన్ 25 ప్రభాతవార్త :**

కడప జిల్లా ఇడుపలపాయ ట్రిపుల్ ఐటికి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సీటు సాధించినట్టు హెడ్‌మాస్టర్ కె సులోచన తెలిపారు. పదవరతగతి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను కనపరిచి అన్ని సబ్జెక్ట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మహాలక్ష్మీ, ఎస్‌బి హేమలతలను అభినందించారు. మంచి మార్కులతో ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన ఇరువురిని ఆదర్శంగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కూడా కష్టపడి చదువుకోవాలన్నారు. ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన మహాలక్ష్మీ, హేమలతను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

## మామిడి రైతులను ఆదుకోండి



***పాకాల, జూన్ 25, ప్రభాతవార్త*** పాకాల మండలం దామలచెరువు మ్యాంగో నగర్‌లోని మామిడి మండీలను, ర్యాంపులను మండల సిపిఎం బృందం పరిశీలించింది. ఈ బృందం రైతులతో ప్రస్తుత మామిడి కోతలపై రైతులు సిపిఎం బృందం మాట్లాడుతూ గత సంవత్సరం ఒక కేజీకి తోతాపురి 25 రూపాయల నుంచి రకాలు 75 రూపాయల వరకు ధర పలికిందని, అదే ఈ సంవత్సరం కేజీకి రెండు మూడు రూపాయలు ధర పలుకుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము పంటకు కిరిమి సంహారక మందులు కాపు, కోత కూలీలు పెట్టుబడులు అన్నీ ఖర్చు పెట్టిన గిట్టుబాటు ధర రాలేదని ఏ రైతును పలకరించిన ఆవేదనకు గురవుతున్నారని, ప్రభుత్వం రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కేజీకి 12 రూపాయల తక్కువ కాకుండా ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమం లో సిపిఎం కార్యదర్శి మధుసూదన్ రావు నాయకులు ప్రసాద్, లక్ష్మయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై దృష్టి సారిద్దాం

**– సమగ్ర శిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి**



**కేవీబీ పురం, జూన్ 25 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాల గల పిల్లలపై దృష్టి సారించాలని తిరుపతి జిల్లా సమగ్ర శిక్షా ఐఈకో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎల్ఎస్‌వో కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయుడులు తెలిపారు. మండల కేంద్రంలోని కేవీబీ పురం భవిత కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఐఈ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి సీడబ్ల్యుఎస్ఎన్ పిల్లల సామర్థ్యాలను పరిశీలించి తరువాత రికార్డులను పరిశీలించారు. సీడబ్ల్యుఎస్ఎన్ నమోదును పెంచాలని, ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలించి యాక్టివిటీస్ క్రమం తప్పకుండా ప్రతి ఒక్క పిల్లవాడు ప్రతి మంగళవారం జరిపించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే భవిత ఉపాధ్యాయులు కె.నవీన్‌బాబు, జైశంకర్, ఫిజియోథెరపీస్టు జ్ఞానవేఖర్‌లకు భవిత పాఠశాల అభివృద్ధికై సూచనలు అందించారు. తరువాత ఏఎల్ఎస్‌వో చంద్రశేఖర్‌నాయుడు బడి బయట ఉన్నటువంటి పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో భాగంగా కేవీబీ పురం, కళత్తూరు ప్రాంతాల్లో విద్యార్థులను చైతన్యపరచారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు యొక్క ఉపాధ్యాయుల బృందం పిల్లల ప్రయాణ సౌకర్యానికై అలవెన్స్‌లను సకాలంలో అందించవలసిందిగా కోరారు. తాము ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలకు వచ్చే విధంగా తోడ్పడతామని, ఎన్రోల్‌మెంట్ పెంచుతామని అధికారులకు తెలిపారు.విద్యాశాఖ అధికారులు లక్ష్మీపతి, రవికుమార్, సీఆర్పీ ప్రధానోపాధ్యాయులు కె.సురేష్, సీఆర్పీలు సూపర్, రవి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## పింఛన్ కోసం ఎదురు చూపు

**ఏడాది నుంచి ఇవ్వడం లేదంటూ ఆవేదన, తెరుచుకోని వెబ్‌సైట్ ఎప్పటికీ ఇస్తారు తెలియని దుస్థితి**

***కేవీబీ పురం, జూన్ 25 ప్రభాతవార్త:*** కేవీబీ పురం మండలం దిగువపుత్తూరు గిరిజన కాలనీకి చెందిన తుపాకుల ధనమ్మ రెండేళ్ళ క్రితం(2023 ఏప్రిల్‌లో భర్తను కోల్పోయింది. ఆ నాటి నుంచి ఆమె వితంతు పింఛన్ కోసం ఎదురుచూస్తుంది. 2024 జనవరి వరకు వైసీపీ నాయకులు అదిగో...ఇదిగో అంటూ నెట్టుకొచ్చారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ వలన జూన్‌లో ఎగ్గొట్టారు. ప్రభుత్వం మారిన తరువాత పింఛన్ల కోసం దరఖాస్తులను కూడా స్వీకరించడం లేదు. దీంతో ధనమ్మకు నీటికికూడా పింఛన్ నోచుకోలేదు.దీంతో ఆమె కుటుంబంజరగడమే కష్టంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. కేవీబీ పురం మండలంలోని ఎస్ఎల్ పురం గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న మంగమ్మ(60) వయసు దాటిన వలన కనీసం ఉపాధి వ్యవసాయ పనులకు కూడా వెళ్ళలేని స్థితి ఆమెకు సెంటు భూమి కూడా లేదు. 60 ఏళ్ల దాటింది పింఛన్ అయినా రాకపోతుందా అని చూడవలసిన దుస్థితి. అయినా దరఖా స్తులకు అవసరమైన ధృవీకరణ పత్రాలను అవసరమైన ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్వీకరించడం లేదు. ఇది కేవలం ధనమ్మ, లక్ష్మమ్మ, బాలాజీ సమస్య మాత్రమే కాదు. మండల వ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు ఒంటరి మహిళలు వివిన్న ప్రతిభావంతులు డప్పు కళాకారులు చేనేత కల్లు గీత కార్మికులతో పాటు వివిధకేటగిరీలో పింఛన్లకు అర్హులైన వందలాది మంది మండలంలో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

## పదోన్నతలు కల్పించి బదిలీలు చేపట్టండి

**– ఎంపీడీవోకు వినతి అందించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు**

**కేవీబీ పురం, జూన్ 25 ప్రభాతవార్త:** మండలంలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతలు కల్పించి బదిలీల ప్రక్రియను చేపట్టాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మాలతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రేషనలైజేషన్ వలన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పని భారం పెరిగిందని తెలిపారు. పనిభారం పెరగడంతో పాటు విధుల్లో చేరి సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు పదోన్నతలు కల్పించకపోవడంతో పాటు మా వద్ద వెట్టిచాకిరి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత విషయంపై ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతలు కల్పించి పనఇ భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పవన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారాహీ నవరాత్రులను విజయవంతం చేయండి..!

**శ్రీశక్తి పీఠం మేనేజింగ్ సెక్రటరీ శ్రీకాంత్**



***రామచంద్రాపురం, జూన్ 25 ప్రభాతవార్త:*** నేటి నుండి ప్రారంభమయ్యే శ్రీవారాహీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీశక్తి పీఠం మేనేజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ కోరారు. బుధవారం శ్రీశక్తి పీఠంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీఆదివారాహీ అలంకరణలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని అన్నారు. జూన్ 4న శ్రీవజ్రవారాహీ దేవి ఉత్సవాలు ముగుస్తా యన్నారు. 5వ తేదిన 108 రకాల విశిష్ట ద్రవ్యాలతో శ్రీవారాహీ మంత్ర హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి రోజూ శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు శ్రీసిద్దేశ్వరానంద మహాభారతిస్వామి, మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశిష్ట పూజలు. ప్రత్యేక మంత్ర హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్వేత వారాహీ దీక్ష చేపట్టదలచిన భక్తులు పీఠం మేనేజర్ ప్రసాద్‌ను కలసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## త్రిబుల్ ఐటీకి ముగ్గురు గురుకుల విద్యార్థులు ఎంపిక



**సత్యవేడు, జూన్ 25 ప్రభాతవార్త:** సత్యవేడు జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులకు కడప త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్టు స్థానిక గురుకుల పాఠశాల ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంపికైన వారిలో నారాయణవనం మండలం తుంబూరు గ్రామానికి చెందిన విద్యార్థి ఉదయకుమార్, వరదయ్యపాళెంకు చెందిన జస్వంత్, శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థి బెన్హర్ బాబులు ఉన్నారు. వీరికి పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా కడప ఇడుపులపాయ త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. త్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.



తిరుపతి అర్బన్ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన సురేష్ బాబు

**తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ శైలజ

**తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త**


కెనరా బ్యాంక్ Canara Bank Together We Can — తిరుపతి అక్కారంపల్లి శాఖ, తిరుపతి ఫోన్: 9440905341

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను ఐట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 02.07.2025 వ తేదీ లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:03.07.2025 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర.నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | 24.6.25 నాటికి బకాయిలు |
|---|---|---|---|---|
| 1 | 180070520442 | టి.రవీంద్ర, తండ్రి టి.రామక్రిష్ణ, ప్లాటు నెం.4654 తారకరామ నగర్, తిరుపతి | 11.800 | 54,507.00 |

తిరుపతి, తేది: 24.06.2025 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# ఉపయోగపడే ఉపాధి పనులు చేయించాలి : ఎంపీపీ



బాలాయపల్లి, జూన్ 25 ప్రభాతవార్త : ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి సూచించారు. బాలాయపల్లి స్త్రీ శక్తి కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. గూడూరు వెంకటగిరి రోడ్డు పనులు కూడా త్వరగా పూర్తి చేయించాలని అధికారులను కోరారు.పలు శాఖల అధికారులతో శాఖలవారిగా జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. వెంకటగిరి గూడూరు రోడ్డు మూడు సంవత్సరాలుగా అధ్వానంగా ఉందని పలువురు సర్పంచులు సభ దృష్టికి తేవడంతో, నిధులు లేవని గత కాంట్రాక్టర్కు బిల్లులు ఇవ్వలేదని, బిల్లులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని ఆర్ అండ్ బిఏఈ బాబు తెలిపారు. ఏపీవో జ్యోతి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో రైతులు ఉద్యాన వన పంటలు ఆదర్శవంతంగా సాగు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలకు, రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులు అనుసంధానం చేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి కోరారు. నిడిగల్లుజయంపు మార్గమధ్యంలో తారు రోడ్డు అధ్వానంగా ఉందని పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఎంపీపీ కోరారు. వెంకటగిరి వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు సరి చేయాలన్నారు. జయంపులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారే తప్ప నేటికీ సేవలు అందడం లేదని, మంత్రి ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. నాయుడుపేట నుంచి జయంపు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రజా దర్బార్లో కూడా ఈ సమస్యలు ఎమ్మెల్యేకు ప్రస్తావించామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయక పోవడంతో సమావేశాలకు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరు కావడం లేదని ఎంపిపి విమర్శించారు. గత తహశీల్దార్ ఒక్క పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదని, ఇప్పటి తహసిల్దార్ విజయలక్ష్మి చొరవ తీసుకొని అర్హులైన అందరికీ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. పొజిషన్ సర్టిఫికెట్లు లేకపోతే గృహలు మంజూరు కావన్నారు. ఏపిఎం కిరణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 30 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. గతంలో నగదు రూపేణా ఇచ్చే వారని, ఇప్పుడు ఫేషియల్ యాప్ ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. బాలయపల్లి, వెంగమాంబాపురం ప్రభుత్వ హాస్టళ్ళకు మొత్తం రూ.30 లక్షలు మంజూరైనట్లు ఈ నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు వాన పార్వతి, మురళి మోహనరెడ్డి, ఎంపీటీసీలు సుజాత, సురేంద్రరెడ్డి, రామయ్య, సర్పంచులు మల్లెమాల గోపి కృష్ణారెడ్డి, అంజలి, తహశీల్దార్ విజయ, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, సిడిపిఓ శంషాద్ బేగం, ఫారెస్ట్ అధికారిని భవాని, హౌసింగ్ ఏఈజిబి వెంకటేశ్వర్లు, మేట్రన్ చెంచు రత్నమ్మ, వార్డెన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## సంవిధాన్ హత్య దివస్ అంశంపై అవగాహన

గూడూరు, జూన్ 25 ప్రభాతవార్త : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో సంవిధాన్ హత్య దివస్అనే అంశంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివ ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమమైన పరిపాలన విధానానికి మన రాజ్యాంగం పెద్దపీట వేసిందని అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం 1975లో విధించిన జాతీయ అత్యవస పరిస్థితి ప్రజల హక్కులను హరించి వేసిందన్నారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కె.రవిరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.విజయ మహేష్ మాట్లాడుతూ 1975 జూన్ 25 జాతీయ అత్యవసర పరిస్థితి ఏర్పడడానికి గల కారణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణరాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్, శ్రీధర్ శర్మ, కిరణ్మయి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ శైలజ, భీమవరపు లక్ష్మి, కృపా కరుణ వాణి, హిమబిందు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఉపాధి హామీ పనులు చేపట్టాలి

కోట, జూన్ 25 ప్రభాతవార్త : మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని ఏపీడీ వరప్రసాద్ కోరారు. బుధవారం కోటలోని ఉపాధి కార్యాలయంలో ఆయన క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కోట మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని కోరారు. కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పూర్ణిమ తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



సూళ్లూరుపేట, జూన్ 25 ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి మాజీ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అంబటి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలుగా లలిత, కార్యదర్శిగా అరుణకుమారి, కోశాధికారిగా జానకితో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ ఆదిశేషారెడ్డి, జిఎస్‌టి కోఆర్డినేటర్ జగన్నాథరావు, ఆర్‌వి రావు, మధుసూదన్‌రెడ్డి, రాధాకృష్ణరావు, అప్పారావు, గోపాలకృష్ణ, విరూపాక్ష రెడ్డి, శ్రీరంజని, కృష్ణమూర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భూములను సబ్ డివిజన్ చేసుకోండి

పెళ్లకూరు జూన్ 25 ప్రభాతవార్త: మండలంలోని రీసర్వే పూర్తయిన పెళ్లకూరు, పెన్నేపల్లి, తాల్వాయి పాడు, ఆర్లపాడు, శెట్టిగుంట, బంగారంపేట, ఊడిపూడి, జీలపాటూరు, కానూరు గ్రామాలలోని రైతులకు సంబంధించిన భూములు జాయింట్ ల్యాండ్ పాలసీ మ్యాప్ జాయింట్ (ఎల్‌పిఎమ్) లో ఉన్నాయి. ఈ జాయింట్ ఎల్‌పిఎంలు కలిగిన రైతులు పెళ్లకూరు మండలంలోని తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి మండల సర్వేయర్లను గాని గ్రామ సచివాలయ సర్వేయర్లు ను గాని సంప్రదించి ఆన్లైన్ సబ్ డివిజన్ చేయించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని మండల డిప్యూటీ తహశీల్దార్ యువరాజు తెలిపారు

## డ్రోన్‌ల సాయంతో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

చిత్తూరు, జూన్ 25 ప్రభాతవార్త: డ్రోన్‌ల సహాయంతో అసాంఘీక కార్యకలాలపై నిఘా పెంచాలని ఎస్పీ మణికంత చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఎస్పీ మణికంత చందోలు ఆధ్వర్యంలో నెలవారీ జిల్లా నేరసమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎస్పీ మణికంత చందోలు మాట్లాడుతూ ఇప్పటికే సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతిభద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవడం వంటి విభిన్న దశల్లో డ్రోన్లు ఉపయోగపడుతా యన్నారు. అలాగే పెండింగ్‌లో వున్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాల దొంగతరాలు, చీటింగ్, సైబర్ నేరాలు ఇతర కేసులపై ఈ సమీక్షలో ఎస్పీ అధికారులతో సమీక్షించారు. కేసు నమోదు అయిన అనంతరం కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో ఆపరేషన్స్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి

**-కాణిపాకం ఆలయ ఈఓ పెంచల కిషోర్**



కాణిపాకం, జూన్ 25 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కాణిపాకం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ అన్నారు. బుధవారం విశాఖపట్నంకు చెందిన కుమారస్వామి అనే భక్తుడు రానున్న వినాయకచవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈమేరకు మొదటగా కాణిపాకం ఆలయంలోని కాణిపాకం దేవస్థానం ఈఓ పెంచల కిషోర్, సిబ్బంది, అర్చకులకు మట్టి గణపతులను అందజేశారు. ఈగణపతులకు ఆలయ ఈఓ పెంచల కిషోర్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 30 నుండి "సాక్షాత్కార వైభవోత్సవాలు"

**నేడు కల్యాణ ఆలయంలో "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం"**

చంద్రగిరి, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జూన్ 30 నుండి జూలై 2 వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జూన్ 26న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జూలై 3న పార్వేట ఉత్సవం నిర్వహించ నున్నట్లు వివరించారు. గురువారం ఉదయం 7 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ (ఆలయ శుద్ధి) జరుగుతుందన్నారు. ఉత్సవాల నేపథ్యంలో జూన్ 30 నుండి జూలై 3 వరకు ఆలయంలో నిర్వహించే కళ్యాణోత్సవం, తిరుప్పావడ సేవ, అష్టోత్తర శతకలశాభిషేకం సేవ, స్వర్ణపుష్పార్చన సేవలను రద్దుచేసినట్లు తెలిపారు.

## స్మార్ట్ సిటీలో మంజూరైన పనులను పూర్తి చేయాలి: కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 25 ప్రభాతవార్త : స్మార్ట్‌సిటీ మంజూరు కాబడిన పనులు, పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 39వ సమావేశాన్ని స్మార్ట్ సిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన బుధవారం ఉదయం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. స్మార్ట్ సిటీ మంజూరు కాబడిన పనులను, ఇంకను పురోగతిలో ఉన్న 14 పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నందున వీలైనంత మేరకు మున్సిపల్ కార్పొరేషన్ నిదుల నఉంచి కొంత మొత్తం కేటాయించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ డైరెక్టర్లు అయిన సీఈవో, ఎండీ ఎం. మౌర్య,ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్ రావు, ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమశ్రీ, ఇంజనీరింగ్ అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు.

## కేరళ రాష్ట్ర బిజెపి నేతకు ఘన స్వాగతం...



రేణిగుంట జూన్ 25 ప్రభాతవార్త : కేరళ రాష్ట్ర బిజెపి కో ఇన్చార్జ్, పార్లమెంట్ సభ్యు రాలు అపరాజిత సారంగికి రేణిగుంట (తిరు పతి) అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. భారత దేశంలో ఎమర్జెన్సీ విధించి అర్థ శతాబ్దం పూర్తయిన సందర్భంగా తిరుపతిలో జరగ బోతున్న మేధావుల సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆమెకు విమానాశ్రయంలో రాష్ట్ర బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోల ఆనంద్ కుమార్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను కోలా ఆనంద్ కుమార్, సామంచి శ్రీనివాస్ తో కలసి శ్రీకాళహస్తి కలంకారి వస్త్రంతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ : డ్రైవర్ అరెస్టు



గంగవరం,జూన్ 25 ప్రభాతవార్త : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ పేర్కొన్నారు. సిఐ కథనం మేరకు వివరాలిలా..తిరుపతి జిల్లా నగిరికి చెందిన బాబు(39)అనే వ్యక్తి నగిరి నుండి దాదాపు 15 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడని సమాచారం రావడంతో అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి దాడి చేయగా మండలంలోని బెంగళూరు చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె క్రాస్ వద్ద బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## రౌడీ షీటర్ హత్య కేసులో ముద్దాయి అరెస్ట్



చిల్లకూరు, జూన్ 25 ప్రభాతవార్త : స్థానిక చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా మేదర కాలనీ వద్ద ఈనెల 24వ తేదీ రౌడీ షీటర్ అచ్చి ప్రవీణ్‌ని అతి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో గూడూరు డిఎస్పి గీతా కుమారి ఆదేశాల మేరకు రూరల్ సీఐ కిషోర్ బాబు ఎస్సై సురేష్ బాబు చాకచక్యంగా హత్య కారణమైన ముద్దాయి బండారి సుబ్రమణ్యం అలియాస్ మణి అనే ముద్దాయిని బుధవారం అదుపులో తీసుకొన అనంతరం చిల్లకూరు పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతి చెందిన ప్రవీణ్ బండారి సుబ్రహ్మణ్యం బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. విషయాన్ని అమ్మాయి బంధువులకి తెలియడంతో వెంటనే మరో అబ్బాయితో పెళ్లి చేయడం జరిగింది. ప్రస్తుతం అమ్మాయికి ఒక బిడ్డకి జన్మనిచ్చింది. అయితే ఇటీవల మృతి చెందిన అచ్చి ప్రవీణ్ అమ్మాయికి ఫోన్ చేసినా నానారకాలుగా ఇబ్బంది పెడుతున్నాడు అన్న విషయాన్ని అమ్మాయి బంధువైనటువంటి బండారి సుబ్రహ్మణ్యంకు తెలియ చేసింది. ఈ విషయంపై ప్రవీణ్ సుబ్రహ్మణ్య మంగళవారం చిల్లకూరు మేదర కాలనీ వద్ద ఎదురుపడి వాదు లాడకోవడం, అది కొంచెం పెద్దై బండారి సుబ్రమణ్యం అనే ముద్దాయి కుటుంబానికి హానీ జరుగుతుందని ముందుగా పథకం ప్రకారం అచ్చి ప్రవీణ్‌ని చంపాలని నిర్ణయి ంచుకోవడంతో, అతను తెచ్చుకున్న మరణ ఆయుధాలతో విచక్షణారహితంగా హత్య చేసారు. జరిగిన వెంటనే ఈ విషయాన్ని ప్రవీణ్ తల్లి చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడంతో సిఐ కిషోర్ బాబు శరవేగంగా ముద్దాయిని అదుపులో కేసు నమోదు చేసి కోర్టుకి ఆజరుపరచారు. ఈ హత్యకి ఇంకెవరికైనా సంబంధం ఉంటే వారిని కూడా దర్యాప్తులో కఠినంగా శిక్షిస్తామ న్నారు. హత్యకు గురైన అచ్చు ప్రవీణ్ గతంలో పలు కేసుల్లో ముద్దాయిగా ఉంటూ ఇటీవల ఓ మర్డర్ కేసులో రౌడీషీటర్ కూడా ఓపెన్ చేయడం జరిగిందని వారు తెలిపారు ముద్దాయి బండారి సుబ్రహ్మణ్యం పై కూడా పలు కేసులు ఉన్నాయన్నారు.

## సర్టిఫికెట్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

దొరవారిసత్రం,జూన్ 25 ప్రభాతవార్త: ప్రభుత్వ సర్టిఫికెట్ కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల నుండి సంక్షేమ పథకాల కోసం విద్యార్థులు కుల ఆదాయ సర్టిఫికెట్ల కోసం తహశీల్దార్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు ప్రజల వద్దకే పాలన అన్న ప్రభుత్వాలు చెబుతున్న డివి సత్రంలో మాత్రం అమలు కావడం లేదు. మండల పరిధిలోని పులికాట్ ప్రాంతంలో వేలుకాదు, మీజూరు గ్రామాల నుండి సర్టిఫికెట్ కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ గత నాలుగు రోజుల నుండి తిరుగుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అయితే అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోగా, ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

## సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 25 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం 25వవార్డు కాంపాళెంలో మన ఇంటికి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని ఆగస్టు 15 నుండి అమలు చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలన్నిటినీ అమలు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని తెలిపారు. ఇప్పుడిప్పుడే సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్,మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనంద్, విశ్వనాథం, రామకృష్ణ, నరసింహులు, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

గూడూరు, జూన్ 25 ప్రభాతవార్త : జీవో నెంబర్ 4 ద్వారా పారా క్రీడాకారులకు ఎటువంటి పరీక్ష లేకుండా త్రీ పర్సెంట్ రిజర్వేషన్‌తో, గ్రూప్ 1, గ్రూప్2 పరీక్షలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న చైతన్య యాత్ర గూడూరుకు చేరుకుంది.గూడూరు పట్టణ సమీపంలోని పోటు పాలెం జాతీయ రహదారి వద్ద పారా స్పోర్ట్స్ చైతన్య యాత్రకు గూడూరు పట్టణానికి చెందిన పారా క్రీడాకారుడు పురుషోత్తం వారి బృందం స్వాగతం పలికారు. పారా క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.పారా క్రీడాకారుల సంక్షేమ కోసం కృషి చేసిన కానుగుంట్ల కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, శ్రీనివాస్ గౌడ్, మల్యాద్రి నాయుడు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



గూడూరు, జూన్ 25 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధన పాటించుకుంటే చర్యలు తప్పవని ఒకటవ, రెండవ పట్టణ సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయ ంలో పట్టణ, రూరల్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న రెండవ రైల్వే వంతెన ద్వారా పట్టణంలోకి ప్రవేశించా లన్నారు. అదేవిధంగా సాధుపేట నుండి వచ్చే ఆటోలు వాటర్ ట్యాంక్ మీదుగా పట్టణంలోకి రావచ్చని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పట్టణ ఎస్సై తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

## ఆత్మహత్యకైనా సిద్ధం...వంతెన నిర్మించాల్సిందే!

చిల్లకూరు, జూన్ 25 ప్రభాతవార్త : మండలంలో తిక్కవరం వద్ద తొణుకుమాల, ఉడతావారిపాల్లపల్లి గ్రామస్తుల ఆందోళన చేపట్టారు. మా గ్రామానికి అండర్ బ్రిడ్జి కావాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సాగరమాల ప్రాజెక్టులో భాగంగా మేఘ కంపెనీ చేపడుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన మేఘ కంపెనీ ప్రతినిధులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. అధికారులు పట్టించుకోవడంలేదని వంతెన నిర్మించే వరకు రహదారి పనులను అడ్డుకుంటామని వారికి తేల్చి చెప్పారు. వంతెన నిర్మించకపోతే కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందని విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ఆసుపత్రికి వెళ్లాలన్నా మాకు కష్టమవుతుందని, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిల్లకూరు మండలం తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వంతెన నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

## జగన్‌ను ఇరికించాలని కూటమి ప్రభుత్వం కుట్ర

కోట, జూన్ 25 ప్రభాతవార్త: ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాలెం గ్రామంలో వైసీపీ కార్యకర్త విగ్రహావిష్కరణ కార్యక్రమం పర్యటన రోజున సింగయ్య అనే వ్యక్తి చనిపోతే ఆ కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఇరికించాలని కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేసిందని వైసీపీ ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆరోపించారు. గతంలో ఇలా ఎప్పుడైనా ఇలా కేసులు పెట్టారా అనేది కూటమి ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు మొదటి నుంచి అనుమతి ఇవ్వకుండా అడ్డుపడుతూ వచ్చారని చెప్పారు.

**పెండింగ్ కేసులపై సీఐ ఆరా :**

పోలీసుస్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆరా తీశారు. బుధవారం కోట పోలీసుస్టేషన్‌కు ఆయన చేరుకుని పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఐకి సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అలవరచుకోవాలని కోరారు. ఆయన వెంట కోట ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

## జాయింట్ ఎల్పీఎమ్‌లు సరి చేసుకోండి



వాకాడు, జూన్ 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రి సర్వే కార్యక్రమంలోని భాగంగా మండలం లోని 16 గ్రామాలలో రీసర్వే పూర్తి చేయబడిందని మండల తహశీల్దార్ రామయ్య తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాలలో కొత్తచెరువు, గుండ్లు, ఉత్తర పొలం, ఇసుకనట్టు, చిన్నప్ప గారి మెట్ట గ్రామాలకు సంబంధించి జాయింట్ ఎల్‌పిఎం ఎక్కువగా ఉన్నందున ఈనెల 30 తేదీ లోపు ప్రభుత్వం ఆదేశాల మేరకు రీ సర్వే కోసం చలానా 50 రూపాయలు మాత్రమే కట్టవలసి ఉందని తెలిపారు. ఈ అవకాశం జాయింట్ ఎల్పీఎంలో ఉన్న పట్టాదారులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రామయ్య కోరారు. ఈనెల 30వ తేదీ పూర్తయిన వెంటనే చాలానా 500 రూపాయలు యధావిధిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో హరిబాబు, విలేజ్ సర్వేయార్ కీర్తి తదితరులు ఉన్నారు.

## నోట్ పుస్తకాలు పంపిణీ



గూడూరు, జూన్ 25 ప్రభాతవార్త: మండల పరిధిలోని అయ్యవారిపాళెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూడూరు శాసనసభ్యులు సునీల్ కుమార్ సహకారంతో నోటుబుక్స్ పంపిణీ చేయడం జరిగినది. ఆ పాఠశాలలోని 6, 5 మంది విద్యార్థులకు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ట్రైబల్ వెల్ఫేర్‌లోని 27 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మేగనూరు ఎంపిటిసి ఉమా మహేశ్వరి, అమరేంద్ర అయ్యవారిపాలెం టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, రవీంద్ర రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ప్రాధానోపాధ్యాయులు, కుమార్, ఉపాధ్యాయులు శివకళ, చంద్రశేఖర్, స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## రోడు ప్రమాదంలో యువకులకు తీవ్రగాయాలు

నాయుడుపేట, జూన్ 25 ప్రభాతవార్త: నాయుడుపేట మండలంలోని శ్రీనివాసుపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నాయుడుపేట పట్టణానికి చెందిన ఉదయ్ కుమార్, రాజేష్‌లు మోటార్ సైకిల్‌పై సూళ్ళూరు పేటకు వెళ్ళి పనులు పూర్తి చేసుకొని తిరిగి రాత్రి సమయంలో నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం శ్రీనివాసపురం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్‌చేయబోయి ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఉదయ్‌కుమార్,రాజేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

## టిడిపి ఎన్నికల పరిశీలకులుగా ప్రసాద్



పెళ్లకూరు జూన్ 25 ప్రభాతవార్త : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులైన దామెర ప్రసాద్ నాయుడును శ్రీకాళహస్తి నియోజకవర్గం రూరల్ మండలం సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించడం జరిగింది. దీంతో బుధవారం జరిగిన ఎన్నికల సమావేశంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డితో కలిసి ఎన్నికల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ తెదేపా పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 'ఘాట్'లో హెల్మెట్ ధరించాల్సిందే!

**-నిర్లక్ష్యం చూపిన 80 మంది ద్విచక్ర వాహనదారులకు జరిమానా**



తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల ఘాట్‌రోడ్లపై సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి బండి నడపాలని తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్ సదుద్దేశ్యంతో సూచనలు చేసినా బేఖాతర్‌చేసేవారే ఎక్కువయ్యారు. ఇటీవల ఘాట్‌లో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవడం, కొందరు గాయాలకు గురవడం జరిగింది. అంతేగాక ఘాట్‌లో ప్రమాదకర ప్రయాణాన్ని సురక్షిత ప్రయాణంగా మార్చుకునేందుకు తప్పకుండా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలనే ఆదేశాలు ఉన్నాయి. అయితే టోల్‌గేట్‌లు దాటిన తరువాత 50శాతమంది వాహనదారులు హెల్మెట్ తీసేస్తన్నారు. దీన్ని గమనించిన టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన రాజు హెల్మెట్ ధారణపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ మేరకు తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, రవాణాశాఖ ఏంవిఐలు సంయు క్తంగా బుధవారం సాయంత్రం తిరుపతికి దిగే మొదట ఘాట్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలిరోజే 80మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా బండి నడపడ ంతో ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధిం చారు. 80వేల రూపాయలు వసూలుచేశారు. కాగా ఘాట్‌లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ఘాట్‌లో హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిలో వ్యాపారులు, ఉద్యోగులు ఉండటం విశేషం. ఘాట్‌లో టోల్‌గేట్‌లో దాటిన తరువాత హెల్మెట్ లేకుండానే బండి నడుపుతున్న వాళ్ళు పెద్ద సంఖ్యలోనే ఉన్నారనేది తొలిరోజే గుర్తించారు. విధిగా హెల్మెట్ ధరించి బండి నడపాలని సూచించారు.

## ఒలింపియాడ్‌లో ద స్కూల్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త : ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ నిర్వహించిన రెండవ స్థాయి పోటీల్లో ద స్కూల్‌కు సంబంధించిన విద్యార్థులు తమ ప్రతిభను చూపి అవార్డులు అందుకున్నారు. వారికి బుధవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. కరస్పాండెంట్ జనార్ధన్‌రావు పవార్ చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులందించారు. సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విశాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులను ఉద్దేశించి జనార్ధన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభతో అవార్డులు సాధించి పాఠశాల పేరుతో పాటు శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేసారన్నారు. రాష్ట్ర టాపర్స్‌గా ఆర్.చారుహాసిని (మాధ్య) ఎస్ చేతన్‌సాయి (సైన్స్) గెలుపొందారు.వారికి మొదటి ర్యాంకుకు రూ.1200,రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.1000 నగదు బహుమతిని అందించారు. దీనితో పాటు గోల్డ్ మెడల్స్ అందించారు. అలాగే ఎ.భవిత, వి.సత్యనారాయణ(9వతరగతి) టి.లాస్యప్రియ, కె.కుష్మిత(8వ తరగతి) కె.ధర్మేష్ (6వ తరగతి) గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్సి అవార్డు అందించారు. తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల కృషితోనే అవార్డులు సాధించారన్నారు.పాఠశాలలో గణిత,విజ్ఞాన శాస్త్రంలో పట్టుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల్ని సత్కరించారు.

## జగన్‌ను కలసిన బియ్యపు మధు,సిపాయి



శ్రీకాళహస్తి,జూన్ 25 ప్రభాతవార్త : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని శ్రీకాళహస్తికి చెందిన నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలు అందించి దుశ్శాలువతో సత్కరించారు. బుధవారం వైకాపా పార్టీ కేంద్ర కార్యాలయంలో సమా వేశాల్లో పాల్గొన్న శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు మర్యాదపూర్వకంగా కలిసారు. జగన్‌కు కూటమి పాలనపై జనాభిప్రాయాన్ని వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కక్షసాధింపు పరిపాలన సాగుతుందని వివరించారు. దాంతో జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ళు ఓపిక పట్టండి రాబోయేది మన పార్టీయే అని ఓదార్చినట్లు తెలిసింది.